సాక్షి
జనగామ

మంగళవారం ¦ 26 ¦ మార్చి ¦ 2024

పెంబర్తి ఎంజేపీ కళాశాలలో రంగులు చల్లుకుని కేరింతలు కొడుతున్న విద్యార్థినులు





జనగామ పట్టణంలోని బీటుబజార్‌లో..



హోలీ వేడుకల్లో కలెక్టర్ తదితరులు







రంగుల్లో తేలియాడి..

- మరిన్ని చిత్రాలు 9లో▸

● ఉత్సాహంగా హోలీ వేడుకలు

హోలీ వేడుకలను జిల్లా ప్రజలు సోమవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. పల్లె, పట్టణం, చిన్నా పెద్దా తేడా లేకుండా రంగుల్లో తేలియాడారు. డీజే పాటలు, డప్పుల దరువుకు స్టెప్పులు వేస్తూ.. కేరింతలు కొడుతూ సంతోషంగా గడిపారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సంబరాల్లో కుటుంబ సభ్యులతో కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఏఓ రవీందర్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక హోలీ అని పేర్కొన్నారు.

- జనగామ రూరల్





జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో హోలీ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు, చిన్నారులు

న్యూస్‌రీల్

రేపు సోమేశ్వరాలయంలో హుండీ లెక్కింపు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 27న బుధవారం హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో లెక్కింపు ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు.

27న డీసీసీబీ మహాజన సభ

హన్మకొండ: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) మహాజన సభ ఈనెల 27న ఉదయం 11 గంటలకు జరుగుతుందని సీఈఓ మహమ్మద్ వజీర్ సుల్తాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో జరిగే మహాజన సభకు సభ్యులంతా హాజరు కావాలన్నారు.

రేపట్నుంచి జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 27, 28 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగం ఇన్‌చార్జ్ హెడ్ డాక్టర్ మాదాసి కనకయ్య సోమవారం తెలిపారు. 'ఫిన్‌టెక్ రెవల్యూషన్ రీషేపింగ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇన్ ది డిజిటల్ ఏజ్' అంశంపై నిర్వహించే ఈ సదస్సుకు కేయూ వీసీ తాటికొండ రమేశ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవతో పాటు సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ వరంగల్ డైరెక్టర్(హెచ్ఆర్) నరేన్ కశ్యప్ హాజరువుతున్నారని పేర్కొన్నారు.

ఉచిత కోచింగ్ దరఖాస్తుకు నేడు చివరి గడువు

విద్యారణ్యపురి: హనుమకొండలోని షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో.. ఏప్రిల్ 3వ తేదీ నుంచి వంద మంది అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నారు. ఈ మేరకు హనుమకొండలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధికారి నిర్మల, ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ గౌరవ సంచాలకులు జగన్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు చివరి గడువు నేటితో ముగియనుందని వారు పేర్కొన్నారు. టీఎస్ స్టడీ సర్కిల్.కో.ఇన్ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రుద్రేశ్వరస్వామికి రంగులతో అలంకరణ



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో సోమవారం హోలీ పండుగను పురస్కరించుకుని స్వామి వారిని సహజ రంగులతో అలంకరించారు. ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సున్నం, పసుపు, కుంకుమ, నీలి రంగు శంకు పూలు, మోదుగ పూల రసం తదితర సహజ రంగులతో స్వామివారిని అలంకరించారు.

హోలీ వేడుకల్లో సీపీ



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం హోలీ సంబరాలు జరిగాయి. ఉదయాన్నే పోలీస్ అధికారులు చేరుకుని సీపీ అంబర్ కిషోర్ ఝాకు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ కలిసి నృత్యాలు చేసిన తర్వాత సీపీ స్వీట్లు పంపిణీ చేశారు. డీసీపీలు అబ్దుల్ బారీ, రవీందర్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

హోలీ.. విషాద కేళి!

రంగుల పండుగ వేళ.. కొందరి కుటుంబాల్లో విషాదం నెలకొంది. స్నేహితులు, బంధుమిత్రులతో కలిసి సంతోషంగా హోలీ ఆడుకున్న పలువురు ఆ తరువాత వివిధ ప్రమాదాల్లో మృత్యువాతపడ్డారు. అప్పటివరకు ఆనందంగా గడిపిన వారు ఇకలేరన్న విషయం తెలుసుకున్న కుటుంబాల సభ్యులు గుండెలవిసేలా రోదించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సోమవారం వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఏడుగురు మృతిచెందారు. వెంకటాపురం(ఎం) మండలంలో ఇద్దరు స్నేహితులు కాల్వలో స్నానం చేసి వస్తూ బైక్ అదుపుతప్పిచెట్టను ఢీకొట్టి దుర్మరణం చెందారు. హసన్‌పర్తి మండలం పలివేల్పుల, గుండ్లసింగారం సమీపాన ఎస్సారెస్పీ కాల్వలో స్నానాలకు వెళ్లిన ముగ్గురు గల్లంతయ్యారు. వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమవగా, మరొకరి కోసం గాలింపు కొనసాగుతోంది. నర్సింహులపేట మండలంలో స్నేహితులతో కలిసి చెరువులోకి ఈతకు వెళ్లిన బాలుడు నీటిలో మునిగి మృత్యువాత పడ్డాడు.

పండుగపూట మరణ మృదంగం

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల ఏడుగురు మృతి
- ఎస్సారెస్పీ కాల్వలో ముగ్గురి గల్లంతు.. ఇద్దరి మృతదేహాలు లభ్యం
- చెరువులో ఈతకు వెళ్లి విగతజీవిగా మారిన బాలుడు
- వెంకటాపురం(ఎం) మండలంలో ఇద్దరు స్నేహితులు దుర్మరణం
- గోపాల్‌పూర్ శివారులో ఆటో బోల్తా.. యువకుడి మృతి

ఎస్సారెస్పీ కాల్వలో పడి..



కేదారేశ్వర్(ఫైల్)



క్రాంతికుమార్(ఫైల్)

హసన్‌పర్తి: దామెర మండలం ఊరుగొండకు చెందిన తక్కళ్ల కేదారేశ్వర్(45), ముప్పు క్రాంతికుమార్(35) పదేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం యాదవనగర్‌కు వచ్చారు. అక్కడే అద్దె ఇళ్లలో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. హోలీ వేడుకల్లో పాల్గొన్న కేదారేశ్వర్, క్రాంతికుమార్ స్నానం చేసేందుకు పలివేల్పుల సమీపాన ఉన్న ఎస్సారెస్పీ కాల్వ వద్దకు వచ్చారు. స్నానం చేయడానికి కాల్వలో దిగడంతో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆటోనగర్ ప్రాంతంలో కేదారేశ్వర్ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. క్రాంతికుమార్ మృతదేహం గీసుకొండ మండలంలో లభ్యమైనట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపారు.

మృత్యువులోనూ వీడని గురుశిష్యుల బంధం

కేదారేశ్వర్, క్రాంతికుమార్ గురుశిష్యులు. 28 ఏళ్ల క్రితం ఊరుగొండలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో కేదారేశ్వర్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. అదే స్కూల్‌లో క్రాంతికుమార్ చదువుకున్నాడు. అప్పుడు గురుశిష్యులుగా ఉండగా ఇప్పుడు ఆప్తమిత్రులుగా మారారు. మృత్యువులోనూ గురుశిష్యుల బంధం వీడలేదని స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు.

స్నేహితులతో కలిసి వేడుకలు జరుపుకోవడానికి వచ్చి..



భార్యాపిల్లలతో బ్రహ్మచారి (ఫైల్)

హసన్‌పర్తి: గుండ్లసింగారం సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వలో రాపాక బ్రహ్మచారి (40) గల్లంతయ్యాడు. కమలాపూర్ మండలం శ్రీరాముల పల్లికి చెందిన బ్రహ్మచారి కొంత కాలంగా నగరంలోని కమ్మరివాడలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. వెల్డింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. స్నేహితులతో కలిసి హోలీ వేడుకలు జరుపుకోవడానికి గుండ్లసింగారానికి వచ్చాడు. వేడుకల అనంతరం కాలకృత్యాలు తీర్చుకోవడానికి కాల్వలోకి దిగాడు. ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండడం.. వెంట వచ్చిన వారికి ఈత రాకపోవడంతో రక్షించడానికి ధైర్యం చేయలేదు. పోలీసులు బ్రహ్మచారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

హోలీ ఆడాక ఈతకు వెళ్లిన బాలుడు..



రిత్విక్‌రెడ్డి (ఫైల్)

నర్సింహులపేట: మహబూబాబాద్ జిల్లా రామన్నగూడెం గ్రామానికి చెందిన అబ్బోరి వినోద్‌రెడ్డి, పద్మ దంపతుల కుమారుడు రిత్విక్‌రెడ్డి (10) తన స్నేహితులు వర్షిత్ రెడ్డి, తరుణ్‌రెడ్డి, సాయిచరణ్‌తో కలిసి హోలీ ఆడాడు. అనంతరం స్నానానికి సమీపంలో ఉన్న గణేష్ చెరువులోకి వెళ్లారు. కూల్‌డ్రింక్ తాగుతూ కొద్దిసేపు సంతోషంగా గడిపారు. లోతు లేదనుకున్న రిత్విక్‌రెడ్డి ఈత కొడదామని అందులోకి దిగాడు. పెద్ద గుంతలోకి కూరుకుపోవడం.. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు పెద్దగా కేకలు వేయడంతో దూరంలో వ్యవసాయ పనులు చేస్తున్న మంద వెంకట్‌రెడ్డి, కల్లుగీత కార్మికుడు గుండగాని వెంకన్న అక్కడికి వచ్చారు. నీటిలో కనిపించకపోవడంతో చెరువులోకి దిగి బాలుడికి బయటికి తీయగా అప్పటికే చనిపోయాడు. తల్లిదండ్రులు, గ్రామస్తులు బాలుడిని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. తండ్రి వినోద్ రెడ్డి, తల్లి పద్మ దివ్యాంగులు. వినోద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.



ఉమ్మడి ఉమేష్ (ఫైల్)



ఎంబడి శృశాంత్(ఫైల్)

శృశాంత్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



సొంతూరిలో రంగుల పండుగ జరుపుకుందామని..

వెంకటాపురం(ఎం): సొంతూరులో స్నేహితులతో హోలీ జరుపుకోవాలని వచ్చిన ఇద్దరు బీటెక్ మిత్రులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం లక్ష్మీదేవిపేటకు చెందిన ఎంబడి శృశాంత్ (21), తిమ్మాపూర్‌కు చెందిన ఉమ్మడి ఉమేష్(21) స్థానిక జవహర్‌నగర్ మోడల్ స్కూల్‌లో చదువుకున్నారు. ప్రస్తుతం శృశాంత్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో, ఉమేష్ నర్సంపేటలోని జయముఖి కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నారు. ఆది, సోమవారం సెలవు కావడంతో హోలీ పండుగకు ఇంటికి వచ్చారు. సోమవారం మిత్రులతో కలిసి హోలీ ఆడిన అనంతరం రామప్ప చెరువు వద్ద కాల్వలో స్నానాలు చేశారు. ద్విచక్రవాహనంపై వెంకటాపురం వైపు వస్తుండగా లక్ష్మీపురం వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టారు. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలపై పడి రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. వెంకటాపురం ఎస్సై రాజు అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సంబరాలు జరుపుకుని వస్తుండగా..

కమలాపూర్: హోలీ వేడుకలు జరుపుకుని వస్తుండగా ఆటో బోల్తా పడిన ఘటనలో నడికూడ మండలం చెర్లపెల్లికి చెందిన శనిగరపు వంశీ(27) మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. చెర్లపెల్లికి చెందిన గంగారపు వినయ్(డ్రైవర్), బొల్లారపు ప్రశాంత్, శనిగరపు సాయి, శనిగరపు వంశీ కలిసి హోలీ ఆడారు. తర్వాత ఆటోలో కమలాపూర్ మండలం శనిగరం వచ్చారు. అక్కడ మద్యం తాగి చెర్లపెల్లికి వెళ్తున్నారు. ఆటోను వేగంగా నడపడంతో గోపాల్‌పూర్ శివారులో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వంశీ అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.



వంశీ(ఫైల్)

బోల్తా పడిన ఆటో పక్కన వంశీ మృతదేహం

పోలీస్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ చేరుకుని క్షతగాత్రులను 108 ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతుడి తండ్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సోమనాథుడి రచనలు విశ్వవ్యాప్తం..

కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ



సోమనాథుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న కళాపీఠం సభ్యులు

పాలకుర్తి టౌన్: పాల్కురికి సోమనాథుడి రచనలు విశ్వవ్యాప్తం అని మహాత్మా జ్యోతీరావు పూలే డిగ్రీ కాలేజీ అధ్యాపకులు జీడి రమేష్, సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ అన్నారు. సోమనాథుడి 785వ పుణ్యతిథిని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని శ్రీ పాల్కురికి సోమనాథుడి స్మృతి వనంలో దీపారాధన నిర్వహించారు. సోమనాథ కళాపీఠం, శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. తెలుగులో స్వతంత్ర కావ్యాలు, నవీన ప్రక్రియలు రాసిన ఆదికవి మన పాల్కురికి సోమనాథుడు అని కొనియాడారు. సోమనాథుడి రచనలన్నింటిని ఒక దగ్గరికి తెచ్చి పాలకుర్తి గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తే వచ్చే పర్యాటకులకు, పీహెచ్‌డీ స్కాలర్లకు, గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. బమ్మెర, వల్మిడి, పాలకుర్తి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రచయిత్రి సొన్నాయిల కృష్ణవేణి, ఆలయ అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్.శర్మ, అనిల్‌శర్మ, నాగరాజు, మాజీ సర్పంచ్ యాకాంతరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సోమేశ్వర్‌రావు, బజ్జూరి వేణుగోపాల్, మేరుగు మధు, సాంబయ్య, గూడూరు లెనిన్, సుదర్శన్, యతిపతి శ్రీకాంత్, సాయిసందీప్, సంపత్‌రావు పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్

జనగామ రూరల్: అన్నదాతలకు సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి 'రైతు నేస్తం'లో భాగంగా ప్రభుత్వం చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్ జనగామ మండలం గానుగుపహాడ్ రైతువేదికలో మంగళవారం నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు కొనసాగే ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రైతుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ.. సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఈవారం సమగ్ర వ్యవసాయంలో పశుపోషణ, కోళ్లు, గొర్రెల పెంపకం, సేంద్రియ వ్యవసాయం, డ్రోన్లతో పిచికారీ, పంటల లాభ నష్టాలు తెలుసుకోవచ్చని ఏఈఓ సౌమ్య ఒక ప్రకటనలో తెలిపారు.

కొలువు కొట్టేదెట్లా..?



జనగామ రూరల్: సర్కారు కొలువుల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న నిరుపేద నిరుద్యోగులకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి సరైన వనరులు లేకుండా పోయాయి. ప్రభుత్వం డీఎస్సీ, బీఎడ్ అభ్యర్థులకు, అలాగే గ్రూప్–1,2,3 తదితర ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్ష తేదీలు ప్రకటించింది. ఎలాగైనా కొలువు సాధించాలనే లక్ష్యంతో నెలల తరబడి, కొందరు ఏళ్ల తరబడి సిద్ధమవుతున్నారు. ఇలా జిల్లాలో సుమారు 50 వేల మందికిపైగా ఉన్నారు. అయితే ఉన్నత వర్గాలు, ఆర్థికంగా ఉన్నవారు హైదరాబాద్, హనుమకొండ తదితర ప్రాంతాల్లోని ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు వెళ్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వం తరపున ప్రత్యేక శిక్షణ తరగతులు, స్టడీ సర్కిల్ వంటి సదుపాయం లేకపోవడంతో పేద, మధ్య తరగతి అభ్యర్థులు దిక్కుతోచని స్థితిలో ఇళ్ల వద్దే పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. మరి కొంత మంది భారమైనా భవిష్యత్‌పై ఆశతో అప్పుచేసి కోచింగ్ సెంటర్లకు వెళ్తున్నారు.

ఒక ఏడాదికే పరిమితం..

పోటీ పరీక్షల నేపథ్యంలో ఎస్సీ, బీసీ అభ్యర్థుల కోసం ప్రభుత్వం ఉచిత శిక్షణ తరగుతులు నిర్వహించడానికి గత ఏడాది జిల్లా కేంద్రంలో స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. సుమారు 120 మందికి 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చింది. ప్రస్తుతం జిల్లాలో ఎలాంటి సెంటర్ నిర్వహణ లేదు. ఈ ఏడాది ఉచిత శిక్షణ తరగుతులకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించగా.. జనగామ జిల్లాకు సంబంధించిన అభ్యర్థులకు హనుమకొండలో ఉన్న ఉమ్మడి జిల్లా బీసీ స్టడీ సర్కిల్‌లో పరిమిత సీట్లు కేటాయించింది. అయితే జిల్లాకు సంబంధించిన అభ్యర్థులు ఎక్కువ మంది ఉండడం, హనుమకొండ స్టడీ సర్కిల్‌లో అవకాశం లభించినా.. దూర భారం కారణంగా చాలా మంది ఆసక్తి చూపడంలేదు.

స్టడీ సర్కిళ్ల ఏర్పాటు ఎప్పుడు..?

- ఒక ఏడాదితో సరిపుచ్చిన సర్కారు
- ఉమ్మడి జిల్లా కేంద్రంలో అరకొర సీట్లు
- సమయాభావం, ఆర్థిక ఇబ్బందులతో వెనకడుగు
- జిల్లాలో 50వేల మందికి పైగా పోటీ పరీక్షల అభ్యర్థులు

గతంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

గతంలో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష 'టెట్' కోసం ప్రభుత్వం, ప్రైవేట్ శిక్షణ సంస్థలు జిల్లాలో తరగతులు ఏర్పాటు చేయలేదు. దీంతో నిరుద్యోగుల ఇబ్బందులను దృష్టిలోపెట్టుకుని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ప్రారంభించారు.

గ్రంథాలయమే కోచింగ్ సెంటర్..

పోటీ పరీక్షల కోసం పేద అభ్యర్థులకు జిల్లా గ్రంథాలయమే కోచింగ్ సెంటర్‌గా మారింది. నిత్యం మూడు షిఫ్టుల్లో 200 నుంచి 300 మంది చదువుకుంటున్నారు. అయితే ప్రిపరేషన్ కోసం వచ్చే వారి సంఖ్య పెరగడంతో వారికి అవసరమైన పుస్తకాలు, మ్యాగజైన్‌లు, దినపత్రికలు అందడంలేదు. వారు తెచ్చుకున్న మెటీరియల్‌తోనే ప్రిపేర్ అవుతున్నారు. మరికొందరు దాతల సహకారంతో గ్రూప్స్‌కు సంబంధించిన పుస్తకాలను సమకూర్చుకుని అవసరాలు తీర్చుకుంటున్నారు.



జిల్లా గ్రంథాలయంలో చదువుకుంటున్న నిరుద్యోగ అభ్యర్థులు

కానిస్టేబుల్, ఎస్సై శిక్షణకూ అదే పరిస్థితి..

కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల కోసం జిల్లా కేంద్రంలో శిక్షణ కేంద్రాలు లేకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్ శాఖలో ఉద్యోగాలు భర్తీ చేస్తుండగా స్థానికంగా తగిన శిక్షణ అందుబాటులో లేకపోవడంతో హైదరాబాద్, హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్ వంటి దూర ప్రాంతాలకు అభ్యర్థులు వెళ్తున్నారు.

చదువు మీద దృష్టి పెట్టలేక పోతున్నా..



నేను ఎస్జీటీ ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్నాను. జిల్లాలో శిక్షణ కేంద్రాలు లేక పోవడంతో ఇంటి వద్దే ఉంటున్నాను. ఇతర పనులకు వెళ్లాల్సి వస్తుండడంతో చదువు మీద దృష్టి సారించలేక పోతున్నాను. అందుకే జిల్లా గ్రంథాలయానికి వెళ్తున్నాను. స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

- భూక్య సంపత్, ఎస్జీటీ అభ్యర్థి


ప్రైవేట్ కోచింగ్‌కు వెళ్లే పరిస్థితి లేదు



నేను స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ప్రిపేర్ అవుతున్నాను. మాది మధ్య తరగతి కుటుంబం. ఫీజు చెల్లించి ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌కు వెళ్లే పరిస్థితి లేదు. ఇంటి పట్టున ఉండి ప్రిపేర్ అవుతున్నాను. జీకే ఇతర సమాచారం అవసరం ఉన్నపుడు గ్రంథాలయానికి వస్తున్నాను. చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడానికి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి.

- ఆవుల సంధ్యారాణి, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థి

స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలి



జిల్లా వ్యాప్తంగా టీచర్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న వారు 10 వేల మందికి పైగా అభ్యర్థులు ఉంటారు. పేద కుంటుంబాలకు చెందిన వారు పట్టణ ప్రాంతాలకు వెళ్లి కోచింగ్ తీసుకునే పరిస్థితి లేక చదువులో వెనుకబడి పోతున్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులకు కూడా టెట్ తప్పనిసరి చేయడంతో సిద్ధం కావాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలో తప్పనిసరిగా స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలి. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి.

- డి.శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

అదృశ్యమైన మహిళ.. బావిలో అస్థిపంజరమై


లత (ఫైల్)

చిల్పూరు : మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి లత (45) ఫిబ్రవరి 21వ తేదీన అదృశ్యం కాగా సోమవారం వ్యవసాయ బావిలో అస్థిపంజరమై కనిపించింది. స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్, బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితంతో బాధపడుతున్న లత గత నెల 21న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. గతంలోను ఇలా రెండు సార్లు ఇంట్లో నుంచి వెళ్లి పోయి తిరిగి వచ్చేది. ఒకరోజు దాటినా రాకపోవడంతో తెలిసిన బంధువుల ఇళ్లలో వెతికారు. వారం దాటినా జాడ కనిపించక పోవడంతో లత భర్త కిష్టయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు, కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. సోమవారం ఉదయం చిల్పూరు సమీపంలోని వ్యవసాయ బావి నుంచి దుర్గంధం రావడంతో ఏదైనా జంతువు పడి ఉండొచ్చని చూడగా మనిషి అస్థిపంజరం కనిపించింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌యాదవ్, ఎస్సై రాజేందర్ ఘటన స్థలానికి చేరుకుని అస్థిపంజరాన్ని బయటకు తీయగా చీరను గుర్తించిన బంధువులు లతదేనని నిర్ధారించారు. కేసు నమోదు చేసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆస్ట్రేలియా అతిథులొచ్చారు

- అమ్మవారిపేట, జక్కలొద్ది, రంగసముద్రం చెరువుల్లో విదేశీ పక్షుల సందడి
- మూడు నెలలు ఇక్కడే ఆవాసం, సంతానోత్పత్తి
- వీక్షించేందుకు వస్తున్న పర్యాటకులు


అమ్మవారి పేట చెరువులో ఆస్ట్రేలియా పక్షుల సందడి

ఖిలా వరంగల్ : వరంగల్ నగరానికి విదేశీ పక్షులు అతిథులుగా విచ్చేశాయి. కిలకిల రాగాలతో స్థానిక ప్రజలను, పర్యాటకులను స్థానిక చెరువులు ఆకర్షిస్తోంది. ప్రకృతి పరమైన రక్షణ కోసం ఎన్నో దేశాలు..ఖండాతరాలను దాటి దక్షిణాది రాష్ట్రాల పక్షులతోపాటు వందలాది ఆస్ట్రేలియా (స్పెర్-వింగ్డ్ ల్యాప్ వింగ్) పక్షులు విచ్చేశాయి. వీటిని చూసేందుకు పర్యాటకులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. వరంగల్ నగర పరిధిలోని రంగసముద్రం, అమ్మవారి పేట, జక్కలొద్ది చెరువులలో ఆస్ట్రేలియా పక్షులు సందడి చేస్తున్నాయి. చుట్టూరా గుట్టల నడుమ ప్రశాంతమైన వాతావరణంలో మూడు చెరువులుంటాయి. ఇక్కడ జనసంచారం అత్యంత తక్కువగా ఉంటుంది. ప్రతిఏటా జనవరి చివరిలో ఆస్ట్రేలియా నుంచి పక్షులు వరంగల్‌కు చేరుకుంటాయని, నీటి శాతం తగ్గగానే తిరిగి వెళ్లిపోతాయని స్థానికులు చెబుతున్నారు. ప్రధానంగా అమ్మవారి చెరువులో పచ్చని చెట్లపై రంగు రంగుల తెల్లని పూలవలే విడిది చేసేందుకు స్వదేశీతోపాటు (ఆస్ట్రేలియా)విదేశీ పక్షులు విచ్చేశాయి. అనువైన చెట్టు కొమ్మలపై ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఇక్కడే సంతానోత్పత్తి చేసుకుంటాయి. ఆపై వాటికి రెక్కలొచ్చాక.. వాటిని తమ వెంట ఆస్ట్రేలియాకు తీసుకుపోతాయని గ్రామస్తులు చెబుతున్నారు. వీటిని మన దేశపు పక్షులు ఆస్ట్రేలియా పక్షులకు పైలట్‌గా వ్యవహరిస్తూ వాటి చుట్టే చక్కర్లు కొట్టడం విశేషం.ఆస్ట్రేలియా నుంచి సుమారు 300 నుంచి 500 వరకు వైట్, బ్లాక్, మిక్సింగ్ కలర్లతో పక్షులు వచ్చినట్లు రిస్క్ టీమ్ బృందం సభ్యులు అంచనా వేశారు. చెరువుల చుట్టు పచ్చని చెట్లు, ఎత్తైన గుట్టల మాటున చెరువు ఉండటం.. చెరువుల్లో నీటి శాతం తక్కువగా ఉండటం.. రక్షణ పరంగా వాటికి అనువుగా ఉండటంతో ఆస్ట్రేలియా పక్షులు చేపలను సులభంగా వేటాడుతున్నాయని పక్షి ప్రేమికులు గాదె స్వరూప్‌రెడ్డి, శ్రీనివాస్ చెబుతున్నారు. వీటిని వీక్షించేందుకు హైదరాబాద్, వరంగల్ ట్రైసిటీ నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు విచ్చేసి తమ కెమెరాల్లో ఆస్ట్రేలియా పక్షుల ఫొటోలు బంధించుకుంటున్నారు.

పక్షుల రక్షణకు రిస్క్ టీం



పర్యాటకులు, ఇతర వేటగాళ్ల నుంచి స్వదేశీతోపాటు విదేశీ పక్షులను కాపాడేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక రిస్క్ టీమ్ సోమవారం నగరానికి చేరుకుంది. ఆస్ట్రేలియా పక్షులు సేద తీరుతున్న అమ్మవారిపేట చెరువును పరిశీలించారు. చెరువు చుట్టు పరిసరాల్లో రిస్క్ టీమ్ డేగా కన్నులతో వాటి పరిరక్షణ చర్యలు చేపడుతోంది. పక్షులకు ఎవరు హాని తలపెట్టినా, వేటాడినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వారు చెబుతున్నారు.

సహర్.. పుణ్యఫలం

సహర్ చేయకపోతే రోజా(ఉపవాసం) లేనట్లే. తెల్లవారు జామున భోజనం(సహర్) చేయకుండా రోజా ఉంటే అల్లాహ్ దాన్ని అంగీకరించదని మహ్మద్‌ప్రవక్త తెలిపారని ముస్లింల నమ్మకం. రోజా ఉండేందుకు కనీసం మంచినీరైనా తాగాలని పవిత్ర ఖురాన్‌లో పేర్కొన్నారు. స్వశక్తితో సంపాదించిన డబ్బు ఎంతైనా ఖర్చు చేసి మంచి భోజనం కూడా చేయవచ్చు. అయితే డబ్బు ఉన్నా భోజనం దొరకని బాటసారులు, ఆర్థిక స్తోమత లేని పేదల కోసం కాజీపేట ప్రధాన రహదారిపై ఉచిత సహర్ ఏర్పాటు చేసి నిత్యం వంద మందికిపైగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు..పీస్ కమిటీ సభ్యుడు సయ్యద్ సర్వర్.

- ఉపవాస దీక్షాపరులకు ఉచిత సహర్
- సహర్ రోజాలో ఎంతో కీలకం


సహర్ స్వీకరిస్తున్న బాటసారులు

కాజీపేట : ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనది.. 30 రోజుల పాటు అత్యంత నిష్టతో కఠోర ఉపవాస దీక్షలు చేపడతారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున 3 నుంచి 4 గంటల మధ్యలో భోజనం చేస్తారు. దీన్ని సహరీ అంటారు. అప్పటి నుంచి రాత్రి 7 గంటల వరకు

ఎలాంటి ఆహారం, పానీయాలు తీసుకోకుండా ఉపవాస దీక్షను చేపడతారు. అయితే వేకువ జామున సహర్‌కు ఏర్పాటు చేసుకోలేని వారితో పాటు బాటసారుల సౌకర్యార్థం పీస్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ సర్వర్ ఆధ్వర్యంలో కాజీపేట జమామసీదు ప్రధాన రహదారిపై ఉచిత సహర్‌ను ఏర్పాటు చేసి ఎంతో మందికి లేదనకుండా సహర్(తెల్లవారుజాము భోజనం) అందిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి లారీలు, ట్రకులతో వచ్చే డ్రైవర్లు, బాటసారులకు ఈ సహర్ కేంద్రం వారికి కావాల్సిన సేవలను అందిస్తుంది. స్థానిక యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేయూతనందిస్తున్నారు. సహర్ భోజనం చేయడానికి సౌకర్యంలేని వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. కొంతమంది ప్రయాణికులు, బాటసారులు ఓ ప్రాంతం నుంచి మరో చోటికి వెళ్లే సమయంలో వేకువజామున ఆయా ప్రాంతాల్లోనే సహర్ రూపంలో భోజనం చేసి, ఈ ఉపవాస దీక్షలను కొనసాగిస్తున్నారు. ఉపవాస దీక్ష చేస్తున్న వారి కోసం ముస్లిం యువకులు సహర్ ఏర్పాట్లు చేస్తున్నారు.

పవిత్ర కార్యం..సహర్



పవిత్ర రంజాన్ మాసంలో సహర్ ఏర్పాటు చేయడం పుణ్యకార్యం. కొన్ని కారణాలతో తెల్లవారుజామున ఇళ్లలో సహర్ సిద్ధం చేసుకోలేని వారితో పాటు ఇతర ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారికి సౌకర్యంగా ఉండేలా సహర్‌ను సిద్ధం చేస్తున్నాం. కొన్నేళ్లుగా ఖర్చుకు వెనకాడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇది ఒక పవిత్ర కార్యక్రమంగా భావిస్తాం.

– సయ్యద్ సర్వర్, నిర్వాహకుడు, కాజీపేట

సహర్ చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని వారి విశ్వాసం. ఈ నేపథ్యంలో పలువురు యువకులు పట్టణంలో సహర్ ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకుంటున్నారు.

పండ్ల తోటలను కాపాడుకుందాం..

- వేడి వాతావరణంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- మల్యాల జేవీఆర్‌హెచ్‌ఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త కె.భాస్కర్

పాడి-పంట


మామిడి చెట్టు


బత్తాయి చెట్టు

మహబూబాబాద్ రూరల్ : ఎండకాలంలో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్ దాటిన తర్వాత మొక్కల్లోని పిండి పదార్థాలు ఎక్కువై త్వరగా వాడిపోతాయని మల్యాల జేవీఆర్‌హెచ్‌ఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త కె.భాస్కర్ అన్నారు. పండ్ల తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు.

- భూమిలో తేమ ఆరకుండా 100 మైక్రాన్ల మందం గల సిల్వర్‌షీట్‌ను చెట్ల పాదుల్లో కప్పడం వల్ల నీటి తడులను తగ్గించుకుని మొక్కలను కాపాడుకోవచ్చు.3 అంగుళాల మేర గడ్డి లేదా ఎండిన ఆకులను సైతం కప్పుకోవచ్చు. కాండం మీద 1.5 నుంచి 2 అడుగుల ఎత్తు వరకు బోర్డో పేస్టు పూతపూయాలి. ఇందులో క్లోరిపైరిఫాస్ (20 ఈ.సీ.) 4.5 మిల్లీ లీటర్లను ఒక లీటరు నీటిలో కలిపి కాండంపై పూయాలి.
- పగటి ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్ దాటితే ఎండ వేడికి ఆకులు వాడిపోకుండా ఒక శాతం చక్కెర ద్రావణాన్ని పిచికారీ చేయాలి. (10 గ్రాముల చక్కెరను ఒక లీటరు నీటికి కలపాలి) కాయ పరిమాణం త్వరగా పెరగడానికి పొటాషియం నైట్రేట్ (13-0-45) 10 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. దీని వల్ల చెట్లు కూడా బెట్టను తట్టుకునే శక్తిని కలిగి ఉంటాయి.
- జీవామృతాన్ని చెట్ల పాదుల్లో పోయడం, పైన పిచికారీ చేయడం వల్ల కూడా లాభం ఉంటుంది.చెట్లపై జియో టెక్స్‌టైల్ మెంబ్రేన్ అనే సన్నటి తెరను కప్పడం వల్ల అధిక భాష్పోత్సేకాన్ని తగ్గించడమే కాకుండా కాయలు మాడిపోకుండా నాణ్యతను కాపాడుకోవచ్చు.
- రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మిల్లీ లీటర్లను లీటరు నీటిలో లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లను లీటరు నీటికి చొప్పున లేదా ఇమిడాక్లోప్రిడ్‌తోపాటు ఫిప్రోనిల్ కలిసి ఉన్న పొడి మందును 0.4 గ్రాములను ఒక లీటరు నీటికి చొప్పున లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములను లీటరుకు నీటికి చొప్పున లేదా ప్రాపర్‌గైట్ 2 మిల్లీ లీటర్లను ఒక లీటరు నీటికి చొప్పున కలిపి మందులను మార్చిమార్చి పిచికారీ చేసుకోవాలి.
- పగటి ఉష్ణోగ్రత 37 డిగ్రీలు దాటినప్పుడు బత్తాయి, నిమ్మ, సపోట మొక్కలలో వేరుకుళ్లు తెగులు అధికంగా ఆశించి వారంలోనే చెట్లు చనిపోయే అవకాశం ఉంది. ఈ తెగులు సోకిన మొక్కలు నీరు కట్టిన తర్వాత కూడా వాడిపోయినట్లు కనిపిస్తాయి.
- తెగులు సోకిన మొక్కలకు నీరు కట్టి పాదు అంతా తడిచేటట్లు, మరుసటి రోజు కార్బండిజమ్ 2 గ్రాములను ఒక లీటరు నీటికి చొప్పున కలిపి చెట్టు వయస్సును బట్టి తగినంత మందు ద్రావణాన్ని పాదుల్లో పోయాలి.
- మామిడిలో ప్రస్తుతం ఆకు జల్లెడ గూడు పురుగు ఆశించి కణజాలాన్ని పూర్తిగా తినివేసి ఆకులను జల్లెడ చేసి తర్వాత ఆకులను దగ్గరకు చేర్చి గూడును ఏర్పర్చుకుంటుంది.
- వీటి నివారణకు గూళ్లను వెదురు కర్రతో దులిపి తర్వాత క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లను లీటరు నీటికి చొప్పున కలిపి చెట్లంతా తడిచేటట్లు పిచికారీ చేయాలి.

జాజిరి ఆడి.. బోనం చేసి..


బోనంతో వస్తున్న చిన్నారులు

కొత్తగూడ : జాజిరి..జాజిరి..జాజిరి జాజా అంటూ తొమ్మిది రోజులపాటు ఆడిపాడి వసూలు చేసిన డబ్బులతో చిన్నారులు హోలీ రోజు సమీప ఆలయం వద్ద బోనాలు చేశారు. హోలీ సందర్భంగా మహిళలు కాముడు, పురుషులు జాజిరి ఆట ఆడుతూ ఇంటింటికి వెళ్లి దానం అడుగుతారు. పండుగ ముందు రోజు జాజిరి ఆడిన కోలలను ఒక దగ్గర వేసి కామదహనం చేస్తారు. మరుసటి రోజు దానం డబ్బులతో ఏదైనా దేవాలయం వద్ద బోనం వండుకుని అంతా కలసి సహపంక్తి భోజనాలు చేస్తారు. ఈతంతు దాదాపుగా కనుమరుగవుతోంది. కొత్తగూడ మండలం కొత్తపల్లి గ్రామంలో చిన్నారులు బోనం చేసి అంతా కలసి వనభోజనాలు చేస్తూ సంప్రదాయాలు సజీవంగా ఉన్నాయని గుర్తు చేశారు.

మోటార్ పంపింగ్ నిలిపివేత



కన్నాయిగూడెం : ములుగు జిల్లా కన్నాయిగూడెం లోని తుపాకులగూడెం గుట్టలగంగారం వద్ద గోదావరిపై నిర్మించిన దేవాదుల జె.చొక్కారావు ఎత్తిపోతల పథకం వద్ద ఒక మోటార్ పంపింగ్‌ను సోమవారం అధికారులు నిలిపివేశారు.కొన్ని రోజుల నుంచి ఎత్తిపోతల పథకం వద్ద వివిధ ఫేజ్‌లలో ఉన్న 10 మోటార్ల నుంచి ఐదు మోటర్లను ఆన్ చేసి నీటిని పంపింగ్ చేస్తున్నారు. అందులో ఫేజ్-3లో నాలుగు మోటార్లు, ఫేజ్-2లో ఒక మోటారుతో పంపింగ్ కొనసాగించిన అధికారులు సోమవారం ఫేజ్-3లోని ఒక మోటర్‌ను నిలిపివేశారు. ప్రస్తుతం 1,123 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నట్లు ఏఈఈ ప్రేమ్ కుమార్ తెలిపారు.

రైలుకింద పడి ఇరువురి ఆత్మహత్య


పబ్బ నగేష్ (ఫైల్)

రఘునాథపల్లి : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నిడిగొండ రైల్వే గేట్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, జనగామ రైల్వే పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని ఫతేషాపూర్ గ్రామానికి చెందిన పబ్బ నగేష్ (52) కొన్నేళ్లుగా కుటుంబసభ్యులతో కలిసి ఇబ్రహీంపూర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తు కిరాణం నిర్వహిస్తున్నాడు. కాగా ఇటీవల ఆర్థిక ఇబ్బందులు అధికమవడంతో తీవ్ర మనస్తాపంతో ఉండేవాడు. జీవితంపై విరక్తి చెందిన నగేష్ ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం తెల్లవారుజామున నిడిగొండ రైల్వే గేట్ సమీపంలోని రైలు కిందపడి నగేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకొని గుండెలవిసేలా రోదించారు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఉమారాణి, కుమారులు అజయ్, శివమణి ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియలకు ఫతేషాపూర్ గ్రామస్తులు విరాళాలు సేకరించి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అందరితో కలివిడిగా ఉండే నగేష్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని వృద్ధుడు..

కాశిబుగ్గ : రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్-కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. జీఆర్‌పీ సీఐ నరేష్ తెలిపిన కథనం ప్రకారం.. రైల్వే ట్రాక్‌పై 60 సంవత్సరాల వయస్సు, 5.6 ఎత్తు, చామన చాయ రంగు, కోలముఖంతో లైట్ బ్లాక్ కలర్ పాయింట్, క్రీమ్ కలర్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడని సీఐ తెలిపారు. కుడి పక్క ఛాతీపై శ్యామల అని పచ్చబొట్టు ఉందన్నారు. ఇతర వివరాలు లభించక పోవడంతో మృతదేహన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని తెలిపారు. వివరాలు తెలిసిన వారు హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్‌ను గాని, 97017 47014, 67126 58585 నంబర్‌లలో సంప్రదించాలని సీఐ పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

జనగామ రూరల్ : ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టి వృద్ధుడు మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలోని శామీర్‌పేటలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. శామీర్‌పేటకు చెందిన జక్కుల కొమురయ్య (75) రోడ్డు క్రాస్ చేస్తుండగా పసరమడ్ల నుంచి జనగామ వైపునకు వెళ్తున్న ద్విచక్రవాహనం అతడిని ఢీకొట్టింది. దీంతో కొమురయ్యకు తీవ్రగాయాలు కాగా వెంటనే ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు. దీంతో పండుగ వేళ విషాదఛాయలు అలుముకున్నాయి. అయితే మృతుడి తరఫున ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు.

అత్తగారింటికి వెళ్తుండగా..

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు గ్రామంలో సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురుఎదురుగా ఢీ కొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చిట్యాల మండలంలోని జడల్‌పేట గ్రామ పంచాయతీ పరిధి గాంధీనగర్ గ్రామానికి చెందిన బొట్ల రమేష్(28) తన ద్విచక్ర వాహనంపై అత్తగారి ఊరు వీరయ్యపల్లె గ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో ధర్మరావుపేట గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మాట్ల ప్రేమ్‌కుమార్ తన ద్విచక్ర వాహనంపై చెల్పూరు గ్రామానికి వెళ్తుండగా చెల్పూరు అంగడి ప్రాంతంలో రెండు బైక్‌లు ఎదురెఎదురుగా ఢీకొన్నాయి. దీంతో బొట్ల రమేష్ అక్కడికక్కడే మృతిచెందగా ప్రేమ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రేమ్‌కుమార్‌ను 108లో భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

ఆస్పత్రిపై దాడి.. ముగ్గురిపై కేసు


ఆస్పత్రిలో పగిలిన అద్దాలు

మహదేవపూర్ : జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనలో సామాజిక ఆరోగ్యకేంద్రంపై దాడికి పాల్పడ్డ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సుల్తాన్ రాజయ్య(55) అనారోగ్యంతో బాధపడుతుండగా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. డ్యూటీ డాక్టర్ రాజ్‌కుమార్ ప్రథమ చికిత్స అందించి ఆక్సిజన్ సహాయంతో వైద్యం అందించారు. అయినా అతడి ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తీసుకువెళ్లాలని సూచించారు. వెంటనే 108 అంబులెన్స్‌లో వరంగల్‌కు తరలిస్తుండగా కాటారం మండలం మద్దులపల్లి వద్దకు రాగానే పరిస్థితి విషమించి రాజయ్య మృతిచెందాడు. వెంటనే మృతదేహన్ని మహదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్ నిర్లక్ష్యంతోనే తమ తండ్రి చనిపోయాడంటు వైద్యుడిని దుర్భాషలాడుతూ ఆస్పత్రి అద్దాలు పగులగొట్టారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో భీబత్సం సృష్టించారు. చేతితో అద్దాలు పగుల గొట్టగా గాయాలయ్యాయి. మళ్లీ రాజ్‌కుమార్ చికిత్స అందించారు. కాగా డ్యూటీ డాక్టర్ రాజ్‌కుమార్ విధులకు ఆటంకం కల్గించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుల్తాన్ నవీన్, సుల్తాన్ సునీల్, సుల్తాన్ శామ్యుల్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్లక్ష్యంగా కారు నడిపిన వ్యక్తిపై..

కాజీపేట : కాజీపేట పరిధిలోని నిట్ ఎదురుగా ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. మృతుడి భార్య గోపగాని సృజన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన గోపగాని సురేందర్ (28) భీమారంలో నివాసముంటూ ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి పనులు ముగిసిన అనంతరం ఇంటికి వెళ్లేందుకు నిట్ వద్ద యూటర్న్ తీసుకుంటున్నాడు. అంతలోనే సురేందర్ ద్విచక్ర వాహనాన్ని వెనక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన సురేందర్‌ను 108ద్వారా ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. నిర్లక్ష్యంగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన దేవులపల్లి కార్తీకేయ రెడ్డిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ వివరించారు.

వానకొండయ్య జాతర షురూ


తలంబ్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


గుట్టపై కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే తదితరులు

- వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం
- తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల : జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి రెవెన్యూ పరిధిలోని వానకొండయ్య గుట్టపై సోమవారం నిర్వహించిన దేవతమూర్తుల కల్యాణోత్సవంతో జాతర సందడి మొదలైంది. హోలీ పండుగను పురస్కరించుకొని ఆనవాయితీ మేరకు కడవెండి గ్రామంలో మందాడి వెంకట్‌రెడ్డి ఇంటి నుంచి పూజలు చేసిన తలంబ్రాలు హనుమాన్ ఆలయం వరకు తీసుకువచ్చారు. అక్కడ పూజారి సంపత్‌కుమారాచార్యుల పర్యవేక్షణలో ట్రాక్టర్‌లో ఏర్పాటు చేసిన మగ్గంపై చేనేత కార్మికులు, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి నూతన వస్త్రాలు నేస్తూ.. గుట్టపైకి చేరుకున్నారు. కళాకారుల కోలాటం, డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపు సాగింది. అనంతరం గుట్టపై కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే జాతర నాటికి ఆలయ అభివృద్ధిలో మిగులు పనులు పూర్తి చేసి భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. అనంతరం ఎర్రంరెడ్డి నర్సింహారెడ్డి(ఇంద్రసేనారెడ్డి) ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పెద్ది రమేష్‌గౌడ్, తలంబ్రాల శాశ్వత ప్రతినిధి మందాటి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ, పద్మశాలి సంఘం నాయకులు నల్ల శ్రీరాములు, కొడగాని సోమనర్సోజీ, మహేందర్‌జీ, యాకన్న, మల్లయ్య ముదిరాజ్, జీడీ ఎల్లయ్య, నల్ల ఉపేందర్, గుడెల్లి శ్రీను, భాషిపాక అంజయ్య, ఎంపీటీసీ దుబ్బాక కవిత రత్నాకర్‌రెడ్డి, లీనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి పర్యవేక్షణలో దేవరుప్పుల, కొడకండ్ల ఎస్సైలు చెన్నకేశవులు, శ్రవణ్‌కుమార్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.